## పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

స్వాతి జల్లులు నేలను తాకి సంగీతాన్ని ఆలపిస్తున్నాయి.

అక్కడక్కడా కన్పిస్తున్నాయి, పెంటిని వెంబడిస్తున్న పోతుకుక్కలు.

కరుస్తోంది అది. కసురుతోంది.

లాలనగా స్వీకరిస్తున్నాయి ఆ తిరస్కారాన్ని. తమనుకాదన్నట్లుగా ఎటో చూస్తున్నాయి పోతులు. తిరిగి వెంబడిస్తున్నాయి.

ఒక యువతి, అపురూప సుందరి, పల్లె పడుచు మూరాన చెట్లకేసిచూస్తూ

చద్దిమూట కొంగు చాటున దాచుకుంది. చినుకులకు శరీరం చిందే ఆవిర్లలో పుట్టిన కోరిక మనసును కమ్మేసింది.

ఇప్పటి కిప్పుడే మగనికౌగిలిలోపూర్తిగా కరిగిపోవాలని మనసును పెనవేసుకుంటున్న కోరికల్ని ఎక్కడ దాచుకోవాలో తెలియలేదు.

అలాగే...తడిసిన స్పాంజిలా...పరుపు పరువున, పదినిమిషాల్లో మగని దగ్గరకు చేరింది.

జంబు గూడ చాటున నిల్చుని వున్నాడు అతను.

తనూ అందలో దూరుతూ చద్దిమూట అతనికిచ్చింది.

ఓరగా అతనివైపుచూసింది. పైటతీసి పిండసాగింది.

ఒంగి చీరకుచ్చెళ్లను పైకి లేపి పిండ సాగింది.

చూడనట్లే సద్ది తినసాగాడు అతను.

అతని కడుపుమంట చల్లార్చింది ఆవిడ

తన మనసుమంట ఎలా చల్లార్చుకోవాలో అర్థంకాలేదు. తన స్థితిలో అతడు లేడు.

గజగజ వణకుతూ కరుచుకుని నిల్చుంది.

పొట్టేలు ఒకటి గొర్రె మీదకు ఎగబడుతోంది.

ఆ దృశ్యం ఆవిడ మనసులోని కోరికను భగ్గున రగిల్చింది.

తన కోరిక తీర్చేటట్లులేడు మగడు.

గొర్రెల మందపైకి తోడేల్లు వస్తే కలిగే ఆవేశంలో వందవ వంతు కూడాలేదు. తన మీదకు దూకే ఈ కోరికల్ని అరికడదామని.

గొర్రెల మనసులో కోరికల్ని క్షణంలో పసిగడతాడు. కాని తన మనసులోని కోరికల్ని ఎంతకూ గ్రహించడు.

'అటుచూడ'మన్నట్లుగా చేయిచాపింది.

ప్రకృతి కార్యాన్ని చేయటానికి మహాతాపత్రయపడుతోంది పొట్టేలు.

వాటివేపు చూశాడు అతను.

కాంక్షగా అతన్ని చూసింది ఆవిడ, అతని కళ్లలో కోరికల తాలూకు నీడలేవైనా కన్పిస్తాయేమోనని పరీక్షిస్తోంది.

చిన్నగా నవ్వాడు.

"మందకు పొట్టేలో గొర్రో ఇంకోటి పుట్టాది. ఒకదాని కొకటి తోడైతావుంటే మంద పెద్దదైతాది. రూపాయలు శానా వచ్చాయ్."అన్నాడు.

క్షణంకూడా నిలువలేక పోయిందిఆవిడ.

సంచించుక పోతున్న హృదయంతో ఇంటి దారిబట్టింది.

వర్షానికి తోడు కన్నీళ్లు కూడా ఆవిడ శరీరం మీద దాడిచేస్తున్నాయ్. చినుకుల చిటపటలకు తోడు ఎక్కిళ్ళ శబ్దాలు విన్పిస్తున్నాయి.

—ఎస్. వెంకట్రామిరెడ్డి
-(పోరుమామిళ్ళ)

స్రవంతి నెం: 12లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ ప్యావలి శ్రీరాములు పెట్టిన పేరు: చిలాకా గోరింకలు

ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ భగీరథ



"సినిమా జర్నలిస్టుగా ఏడు సంవత్సరాల అనుభవం తప్ప సాధించిందేంలేదు. నా ఆశ, ఆకాంక్ష ఏదో చెయ్యాలని. ఏం చేస్తానో భవిష్యత్తే నిర్ణయించాలి." అంటూ ప్రారంభించిన శ్రీభగీరథ, పాఠక లోకానికి బాగా సుపరిచితులు. శ్రీ శ్రీ ముందుమాట రాసిన 'మానవత' కవితాసంపుటి. 'అంతం కాదిది ఆరంభం, 'సావేరి' నవలలు కాక అచ్చుకావలసిన వెన్నో ఉన్నాయి.

'ఓ కథరాయండి' కథలపై ఆయన అభిప్రాయాన్ని ఆయన మాటల్లోనే చదవండి.

"ఈ నూతన రచయితలలో రాయాలనే ఉత్సాహమే కాదు, రాయగలిగిన సత్తాకూడా ఉందని ఈ చిన్న కథలు నిరూపిస్తున్నాయి. రెంటిని ఎన్నిక చేయటం వరకే! అయితే వైవిధ్యమున్న రెంటిని ఎన్నిక చేశాను. మిగతా వారు సహృదయంతో అర్థం చేసుకొని మరింత ఉత్సాహంతో రచనలుచెయ్యాలని ఆకాంక్షిస్తున్నాను."

## స్త్రీ మనసుని

గత మూడు రోజులుగా భర్త ఎందుకో మానసికంగా బాధపడుతున్నాడని గ్రహించినా గట్టిగా ఏమిటని అడగలేక పోయింది రాజ్యం.

చాకలి రావటంతో బట్టలు వెయ్యటానికి వెళ్ళింది.

భర్త విడిచి వెళ్ళిన పేంట్, షర్ట్ తీస్తుంటే పాకెట్‌లో తగిలిందో ఉత్తరం దానితోపాటు ఓ చిన్న పిల్లాడి ఫోటో. ఆ